
వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్

భక్తుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి ప్లాంట్

● సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఏర్పాటు

దిల్‌సుఖ్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): భక్తుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ అన్నారు. వాసవి క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో లలితా నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అన్నవరంగా ప్రసిద్ధిగాంచిన సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి ఎల్లవేళలా తన సహాయ సహకారాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లింగాల హరిగౌడ్, వాసవిక్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, దేవస్థాన చైర్మన్ లింగారెడ్డి, మాజీ అధ్యక్షులు చిదర నాగేందర్, కోశాధికారి వక్కలం శ్రీనివాస్‌రావు, వీరేశం, బానుపాక సంతోష్, లక్ష్మీనారాయణ, మహేందర్‌రెడ్డి, వాసవిక్లబ్ జనరల్ సెక్రటరీ కేవీ లక్ష్మీనారాయణ, శ్రీరామ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శివారు మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో కలపడం సరికాదు


నర్సింహారెడ్డిని జ్ఞాపికతో సత్కరిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని 27 మున్సిపాలిటీలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం సరికాదని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ చివరి సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందు వందేమాతరం గీతాలాపన సమయంలో సభలో ఉన్న వారంతా నిల్చొగా ఎంఐఎంకు చెందిన కార్పొరేటర్లు కూర్చొని జాతీయ గేయాన్ని అవమానపరిచేలా వ్యవహరించారని అన్నారు. దీనికి తోడు సభలో అల్లాహు అక్బర్ అంటూ చిత్ర, విచిత్రంగా వ్యవహరించారని, వారిని పదేళ్ల పాటు పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. చివరి కౌన్సిల్ సమావేశంలో భాగంగా డివిజన్ అభివృద్ధికి కేటాయించిన రూ.2కోట్లు ఏమాత్రం సరిపోవని, తక్కువ జనాభా ఉన్న డివిజన్లకు ఎక్కువ, ఎక్కువ జనాభా ఉన్న డివిజన్లకు తక్కువ నిధులు కేటాయించడాన్ని ఖండించారు. సమావేశం అనంతరం సభ్యులను మేయర్ గద్వాల విజయలక్ష్మి జ్ఞాపికతో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని సత్కరించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చాదర్‌ఘాట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు తీవ్రమవుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటిని నియంత్రించగలుగుతామని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ కేబీ మురారీ అన్నారు. మంగళవారం మలక్‌పేటలోని శ్రీవాణి జూనియర్, డిగ్రీ కళాశాలలో జరిగిన సైబర్ క్రైమ్‌పై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చాదర్‌ఘాట్ ఎస్ఐ సురేష్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

గడ్డిఅన్నారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని గడ్డిఅన్నారంలో గల ఐడీయల్ మహిళా డిగ్రీ కళాశాల ముందు రూ.12లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు సుదీష్, దినేష్, రాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


సూర్యానగర్‌లో బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

సూర్యానగర్ టు సికింద్రాబాద్ ఆర్టీసీ బస్సు సర్వీస్


● ప్రారంభించిన కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ సూర్యానగర్ కాలనీ నుంచి పలు కాలనీలను కలుపుకుని సికింద్రాబాద్ వరకు వెళ్లే నూతన బస్సు సర్వీసును మంగళవారం హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సు ద్వారా దాదాపు 10 కాలనీల ప్రజలకు రవాణా సౌకర్యం సులభతరం అవుతుందన్నారు. బస్సు ప్రతి రోజు ఉదయం 8:10 గంటలకు సూర్యానగర్ నుంచి వివిధ కాలనీ గుండా సికింద్రాబాద్ వరకు వెళ్లి వస్తుందని తెలిపారు. సాయంత్ర 6:10 గంటలకు మరో ట్రిప్పు వెళ్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని కాలనీవాసులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం విజయ్, సీనియర్ బీజేపీ నాయకుడు బండారు భాస్కర్‌తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీల్లో సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్‌లోని ప్రతీ కాలనీలో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని చాణక్యపురి, సౌత్‌ఎండ్‌పార్కు కాలనీల్లో పలు అభివృద్ధి పనులను కార్పొరేటర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చింతల అరుణ మాట్లాడుతూ.. రూ.21.5లక్షల వ్యయంతో చాణక్యపురికాలనీ పెద్ద పార్కుకు ఆధునికీకరణ, రూ.17లక్షలతో చిల్డ్రన్స్ పార్కులో వాకింగ్ ట్రాక్, ఇతర మరమ్మతులు, రూ.16లక్షల వ్యయంతో సౌత్‌ఎండ్‌పార్కు కాలనీలోని పార్కు ఆధునికీకరణ పనులను ప్రారంభించామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజారెడ్డి, చాణక్యపురికాలనీ అధ్యక్షుడు ఇ.వేణుగోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి డి.శ్రీధర్‌బాబు, కాలనీ పెద్దలు బీఎల్ నర్సింహారావు, రవిప్రకాశ్, ఏఎస్ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఓంప్రకాశ్‌యాదవ్, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

● నిరసన



సైదాబాద్‌లో చేపడుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఐదేళ్లుగా నత్తనడకన సాగుతుండడంతో మంగళవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం గేటు వద్ద కౌన్సిల్ సమావేశం ప్రారంభానికి ముందు ప్లకార్డు పట్టుకుని నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

- సైదాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి)

సర్పంచ్, వార్డుల రిజర్వేషన్లు ఖరారు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో డిసెంబరు 17న పోలింగ్

గ్రామాల్లో వేడెక్కిన ఎన్నికల వాతావరణం


అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల సర్పంచ్, 134 వార్డు స్థానాల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మండలంలో 14 గ్రామాల్లో మొత్తం 35,585 మంది ఓటర్లు ఉన్నారు. రిజర్వేషన్లు తెలియడంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు నామినేషన్‌కు సంబంధించిన పని మొదలు పెట్టారు. ఇప్పటి నుంచే వార్డుల్లో కలియ తిరుగుతూ కలిసిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ తాను సర్పంచ్, పలానా వ్యక్తి వార్డు సభ్యుడిగా పోటీ చేస్తున్నారంటూ స్థానికులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు.

గ్రామాల వారీగా రిజర్వేషన్ల వివరాలు

అబ్దుల్లాపూర్‌మెట్(బీసీ-మహిళ), అనాజ్‌పూర్(ఎస్సీ-మహిళ), బలిజగూడ(జనరల్-మహిళ), బండరావిరాల(ఎస్సీ-జనరల్), బాటసింగారం(జనరల్), చిన్నరావిరాల(బీసీ-జనరల్) గండిచెరువు(జనరల్), గుంతపల్లి(జనరల్-మహిళ), ఇనాంగూడ(జనరల్), జాఫర్‌గూడ(బీసీ-జనరల్), కవాడిపల్లి(జనరల్-మహిళ), లష్కర్‌గూడ(బీసీ-జనరల్), మజీద్‌పూర్(బీసీ-మహిళ), పిగ్లీపూర్(జనరల్).

మూడో విడతలో ఎన్నికలు..

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 గ్రామాల్లో 3వ విడతలో ఎన్నికలు జరుగనున్నాయి. డిసెంబరు 3వ తేదీ నుంచి 5 వరకు సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేయనున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 9న అభ్యర్థుల విత్‌డ్రా, 3 గంటల తర్వాత బరిలో ఉన్న అభ్యర్థుల ఫైనల్ లిస్ట్‌ను ప్రకటించనున్నారు. అదే రోజు అభ్యర్థుల గుర్తులను కేటాయిస్తారు. 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు, గెలిచిన అభ్యర్థులను అధికారులు ప్రకటించనున్నారు.

ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


జడ్జెస్‌కాలనీ ఫేజ్-1 అసోసియేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రతి కాలనీ, ప్రాంతంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ఎల్బీనగర్ అభివృద్ధియే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లో అసోసియేషన్ భవనాన్ని, గణేష్‌నగర్ కాలనీలో సీసీరోడ్డును ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, జడ్జెస్‌కాలనీ ఫేజ్-1 అసోసియేషన్ అధ్యక్షుడు బాలగోని అంజయ్యగౌడ్, గణేష్‌నగర్‌కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణరావు తదితరులు ఉన్నారు.

నాగోల్ జైపురికాలనీలో..

నాగోల్ డివిజన్ జైపురికాలనీలో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్‌తో కలిసి మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు పగిడిమర్రి శంకర్ మాట్లాడుతూ రూ.19.5లక్షల వ్యయంతో పార్కు ఆధునికీకరణ, రూ.29.5లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు మొదటి అంతస్తు నిర్మాణం, మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజారెడ్డి, శిల్పారెడ్డి, అడహక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంగూడ జంక్షన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు

● రాంగ్‌రూట్‌లో యూ టర్న్‌వైపు వెళ్లకుండా..

● విస్తరణ జరిగేదాకా తాత్కాలిక చర్యలు


గుర్రంగూడ విలేజ్ వైపు ఏర్పాటు చేసిన బారికేడ్లు

సరూర్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ రహదారిలోని గుర్రంగూడ జంక్షన్ వద్ద ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు తాత్కాలికంగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. 'గుర్రంగూడ జంక్షన్.. నిత్యం టెన్షన్' శీర్షికతో ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు స్పందించి తాత్కాలికంగా నాలుగు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గుర్రంగూడ విలేజ్ నుంచి వచ్చే వాహనదారులు కుడివైపు ఉన్న యూ టర్న్ వైపు రాంగ్‌రూట్‌లో వెళ్లకుండా నిరోధించడానికిగాను జంక్షన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాటిని వైరుతో బిగించారు. ఎవరైనా వాహనదారులు సదరు బారికేడ్లను తొలగించినా.. వైరును కట్ చేసినా సీసీ కెమెరాల ద్వారా వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. గుర్రంగూడ రోడ్డు విస్తరణ జరిగే వరకు ఈ తాత్కాలిక ఏర్పాట్లు కొనసాగుతాయని వారు పేర్కొన్నారు.

సొంత నిధులతో ఎస్‌బీఆర్ కాలనీలో సీసీ రోడ్లు


ఎస్‌బీఆర్ కాలనీలో కాలనీవాసులు నిర్మించుకున్న సీసీ రోడ్డు

సరూర్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ 7వ డివిజన్ పరిధిలో గల ఎస్‌బీఆర్ కాలనీవాసులు సొంత నిధులతో కాలనీలో రోడ్ల నిర్మించుకున్నారు. నాలుగు అంతర్గత రోడ్లను మంగళవారం సీసీ రోడ్లు నిర్మించుకున్నారు. గతంలో మునిసిపాలిటీ తరపున నిర్మించిన ఓ సీసీ రోడ్డుకు ఇరుపక్కలా మిగిలిన ఖాళీ ప్రదేశాన్ని సైతం సీసీగా అభివృద్ధి చేసుకున్నారు. ఎస్‌బీఆర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కిడి ముత్యంరెడ్డి చొరవతో కాలనీలో రోడ్లు అభివృద్ధికి నోచుకున్నాయి. ఆయన కాలనీవాసులందరినీ ఏకం చేసి తలాకొంత తోచినంత ఇవ్వాల్సిందిగా కోరడంతో ఒక్కో ఇంటి నుంచి రూ.20వేల చొప్పున అందజేశారు. అలా ఇక్కడి సుమారు 30-40 ఇళ్ల నుంచి రూ.6లక్షల నుంచి 8లక్షల దాకా వసూలు కాగా.. రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.పది లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఖర్చయింది. మిగిలిన మొత్తాన్ని ముత్యంరెడ్డి సమకూర్చారు. నాలుగు అంతర్గత రోడ్ల నిడివి దాదాపు 400 మీటర్లు ఉంటుందని, 25 అడుగుల వెడల్పుతో రోడ్లు నిర్మించుకున్నామని ముత్యంరెడ్డి తెలిపారు.

'ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతలను నిందిస్తే ఊరుకోం'

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడటమే కాకుండా అనవసరంగా తమ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులను నిందిస్తే చూస్తూ ఊరుకోబోమని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మన్సూరాబాద్ బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్‌లోని బీఆర్ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు టంగుటూరి నాగరాజు, రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో సీజ్ చేసిన ఓ అక్రమ కట్టడానికి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ఒత్తిడితోనే అధికారులు రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చారని ఆరోపించారు. అక్రమ కట్టడాలు ప్రోత్సహించేలా అధికారులు సీజ్ చేసిన కట్టడం వద్ద కార్పొరేటర్ నర్సింహారెడ్డితో కలిసి జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మరో ఇద్దరు కార్పొరేటర్లు ఆందోళనకు ఎందుకు దిగారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రిలీజింగ్ చేసిన అక్రమ కట్టడంపై హయత్‌నగర్ డీసీకి వినతిపత్రం ఇచ్చామని, రెండురోజుల్లో అన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీసీ హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, బాలరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చాదర్‌ఘాట్ విద్యుత్ అధికారుల ప్రజాబాట

చాదర్‌ఘాట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అధికారులు మంగళవారం ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలాడేరలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేశారు. పాత కేబుల్‌లను పూర్తిగా తొలగించి కొత్త కేబుల్‌ను ఏర్పాటు చేశారు.

ఫోన్ పోయిందా మీ డబ్బులు గోవిందా..

● కొత్త తరహా సైబర్ నేరాలు

మన్సురాబాద్, 25 నవంబరు (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌరెల్లి గ్రామంలో మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు తారామతిపేట గ్రామ నివాసి దుబ్బా ఐలయ్య (53) వెళ్లారు. తన షర్ట్ పై జేబులో పెట్టుకొన్న సెల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించి అతని కెనరా బ్యాంకు అకౌంట్‌లో ఉన్న రూ.4,25,650లను యూపీఐ ప్రెమెంట్స్, పెట్రోల్ బంక్స్, షాప్స్ వద్ద వివిధ పద్ధతులతో పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర బ్యాంకు అకౌంట్స్ లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకొని దోచుకున్నారు. గుర్తించిన బాధితుడు నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాతీయ న్యాయ, రాజ్యాంగ దినోత్సవం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం జాతీయ న్యాయ, రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ కోర్టులోని బిర్లా ప్లానిటోరియంలో మెగా సిటీ నవకళా వేదిక వారి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్, ఆధ్యాత్మిక వేత్త, సంఖ్యాశాస్త్ర వేత్త దైవాజ్ఞ శర్మ విచ్చేస్తారని తెలిపారు. ఇందులో భాగంగా అత్యుత్తమ సేవలందిస్తున్న న్యాయవాదులు శివకుమార్‌గౌడ్, రాపోలు భాస్కర్, జగదీశ్వర్‌రావు, జంపని శ్రీదేవిలను న్యాయశ్రీ అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు శిక్షణ తరగతులు

కొత్తపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లోని 12 ట్రాఫిక్ పీఎస్‌లలో పనిచేస్తున్న 16 మంది ట్రాఫిక్ పోలీసులకు ఎల్బీనగర్ అల్కాపురి చౌరస్తా సమీపంలో గల ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ), పిల్లల శిక్షణ పార్కు ఆవరణలో ట్రాఫిక్ విధులపై 3రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్, ఎస్‌పీఓలు అమరవర్ధన్‌రెడ్డి, అల్లూరయ్య వారికి పలు అంశాలపై పార్కు లెక్చర్ హాల్‌లో పాఠాలు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా బుధవారం 11కేవీ కలాడేరా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. అక్బర్ టవర్, పూల్‌బాగ్, నల్గొండ ఎక్స్ రోడ్డు, పెట్రోల్ పంపు వెనుక భాగం, కలాడేరా, ఫుట్‌బాల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

● యాగం



హిందుత్వ పరిరక్షణ, దేవాలయాల భూముల సంరక్షణకు రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో మంగళవారం సైదాబాద్ ఏపీపీఏయూలోని రాష్ట్ర కార్యాలయంలో యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు పేరాల శేఖర్ జీ, వానరసేన అధ్యక్షుడు నామ్ రాంరెడ్డి, కేశవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. - సైదాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి)

పండ్ల మార్కెట్‌ను పునః ప్రారంభించండి

● మంత్రి తుమ్మలకు ఎమ్మెల్యే బలాల వినతి


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పండ్ల వ్యాపారుల సౌకార్యార్థం పహడీషరీఫ్‌లో ఏర్పాటు చేసిన పండ్ల మార్కెట్ పునః ప్రారంభానికి చర్యలు చేపట్టాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోరారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహడీషరీఫ్ పండ్ల మార్కెట్‌లో మౌలిక సదూపాయాలు కల్పించి సత్వరమే పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పండ్ల మార్కెట్‌ను పునః ప్రారంభించడం ద్వారా వందలాది మంది పండ్ల వ్యాపారులకు ఉపాధి లభిస్తుందని ఆయన అన్నారు.

ఆర్యవైశ్యులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గుప్తా

వనస్థలిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదిగి, రాజకీయంగా రాణించాలని, అందుకు తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం వనస్థలిపురంలోని వాసవి కన్యాకపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రాంతీయ సదస్సుకు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో, రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ప్రతి స్థానంలో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ఆర్యవైశ్యులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బాలుసా హరిప్రసాద్, బాలున స్వప్న, వీఎన్ గోల్డెన్ కేసీజీఎఫ్ అంచూరి శ్రీనివాస్, డాక్టర్ సారబాబు అనంతం పాల్గొన్నారు.


ఇందిరమ్మ చీరలు పొందిన మహిళలతో మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఆడపడుచుకు ఇందిరమ్మ చీరను అందిస్తాం

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న ప్రతీ ఆడపడుచుకు ఇందిరమ్మ చీరను అందిస్తామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో ఇందిర మహిళ శక్తి చీరలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, శివయ్య, అంజయ్య, కృష్ణ, మహేందర్, గణేష్, వెంకటేష్, హరీష్, వీవోఏలు రాధిక, అండాలు, అరుణ పాల్గొన్నారు.

మధుయాష్కీగౌడ్ వల్లే పేదలకు 'డబుల్' ఇళ్లు

మన్సూరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ చొరవతోనే పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మన్సూరాబాద్ ఎరుకల నాంచారమ్మ బస్తీ అధ్యక్షుడు జగన్నాథం గంగయ్య అన్నారు. మంగళవారం జగన్నాథం గంగయ్య మీడియాతో మాట్లాడారు. బస్తీలోని ఖాళీగా ఉన్న 88 డబుల్ బెడ్రూం ఇళ్లను అక్కడే నివాసముంటున్న నిరుపేదలకు కేటాయించడం కాంగ్రెస్ పనితీరుకు నిదర్శనమని అన్నారు. ఇళ్లు కేటాయించిన లబ్ధిదారులకు సాధ్యమైనంత త్వరగా తాళాలు అందించి వారికి అద్దె బాధలు తప్పించాలని అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

3న జాతీయ వికలాంగుల దినోత్సవం

ఓల్డ్‌మలక్‌పేట నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3న నిర్వహించే జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో వివిధ వికలాంగ సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు మంత్రుల చేతుల మీదుగా సన్మానం, ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ, జీఎం ప్రభంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌నగర్ కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మించండి

● పెద్దఅంబర్‌పేట్ కమిషనర్‌కు కాలనీ వాసుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం సంగం హోటల్ నుంచి వికాస్‌నగర్ కాలనీ వరకు సీసీ రోడ్డును నిర్మించాలని కోరుతూ మంగళవారం కాలనీ వాసులు కమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సంఘం హోటల్ పక్క నుంచి గజ్జిస్వామి కాలనీ ఫేజ్-2, సుప్రభాత్ కాలనీ, వికాస్‌నగర్ కాలనీ వాసులు గత 10 ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్నారని తెలిపారు. మట్టి రోడ్డుతో గత కొన్ని ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్లు బురదమయంగా మారడంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందని తెలిపారు. కాలనీ వాసుల సమస్యను దృష్టిలో పెట్టుకుని వెంటనే సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వికాస్‌నగర్ కాలనీ అధ్యక్షుడు రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా స్వామివారి తిరుకల్యాణం

సంతోష్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవస్థానంలో 37వ అధ్యయన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం బాలబోగం, హవనం, బలిహరణం అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామి తిరుకల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారిని ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నంగనూరి చంద్రశేఖర్, ఆలయట్రస్టీ సభ్యులు నర్సింగ్‌రావు, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు పాటి నారాయణ రెడ్డి, పీఎల్‌కృష్ణ తదిరతులు పాల్గొన్నారు.

● వివాహానికి ఆర్థిక సాయం



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ పాత గ్రామానికి చెందిన గండి నరసింహ కుమార్తె ప్రియాంక వివాహానికి తన వంతు సాయంగా అల్మాస్‌గూడకు చెందిన ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి రూ.25వేలు నగదును మంగళవారం తన నివాసంలో అందజేశారు. కాంగ్రెస్ నాయకులు దిండు శ్రీనివాస్‌గౌడ్, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

- సరూర్‌నగర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి)